క్లుప్తంగా

కేసులకు పరిష్కారం చూపిన లోక్ అదాలత్



బొల్లాపల్లి: వినుకొండ పట్టణంలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో మండలానికి చెందిన కేసులు కొన్ని పరిష్కారమయ్యాయని బండ్లమోటు ఎస్‌ఐ డి.చెన్నకేశవులు తెలిపారు. మండలంలోని గుమ్మనంపాడు, హనుమాపురం, సంగం తదితర గ్రామాల్లో పొలం, ఇళ్ల మధ్య నెలకొన్న స్వల్ప వివాదాలపై అప్పట్లో కేసులు నమోదయ్యాయని, వీటిని ఇరువర్గాలు రాజీ కుదరడంతో లోక్ అదాలత్‌లో పరిష్కరించుకున్నారని తెలిపారు. ఇరువర్గాలకు సంబంధించి స్వల్పవివాదాల్లో నమోదైన 18 కేసులకు సంబంధించి వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ఆర్. ఆశీర్వాదంపాల్ సమక్షంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో పరిష్కారంతో కేసులు కొట్టివేయడం జరిగిందని ఎస్‌ఐ తెలిపారు.

83 కేసులు పరిష్కరించిన జాతీయ లోక్అదాలత్

నరసరావుపేట టౌన్: జాతీయ లోక్ అదాలత్‌లో 83 కేసులు పరిష్కారం కాగా రూ.90 లక్షలు పరిహారం క్రింద కక్షిదారులకు లభించిందని 13వ జిల్లా అదనపు కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి ఆర్. శరత్‌బాబు శనివారం తెలిపారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అదనపు జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులతో పాటు సివిల్, ముందస్తు వ్యాజ్యాలు రాజీ మార్గం ద్వారా పరిష్కరింపబడ్డాయి. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఏ. శోభారాణి, టి. ప్రవల్లిక, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

జెండర్ క్యాంపెయిన్ ర్యాలీలు

బొల్లాపల్లి : డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ సమైక్య సంఘాల ఆధ్వర్యంలో జెండర్ క్యాంపెయిన్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలు నిర్వహించి ప్రధానకూడళ్లలో మానవహారంగా ఏర్పడి మహిళలను సమాన గౌరవంగా చూడాలి, గృహహింసలను వ్యతిరేకించాలి, మహిళలపై దాడులను అరికట్టాలి, సాంఘిక దురాచారాలను నిర్మూలించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీసీలు, వీవోలు, డ్వాక్రా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ వైద్యశిబిరం



వినుకొండ(నూజెండ్ల): ప్రతిదినం- ప్రతి ఇంటా ఆయుర్వేదం అనే కార్యక్రమంలో భాగంగా నూజెండ్ల మండలంలోని ములకలూరు గ్రామంలో గల అయ్యప్పస్వామి దేవాలయంలో దీక్షాస్వాములకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యులు డాక్టర్ ఆర్. శ్రీనివాసరావు దీక్షా స్వాములకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గురుస్వామి సుబ్బరామయ్య, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, ఆయుష్ సిబ్బంది పాల్గొన్నారు.

రామాలయంలో పూజలు

నాదెండ్ల: గణపవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన పూజారులు ఉమామహేశ్వరశర్మ, అనిల్‌కుమార్ తెలిపారు. ఆదివారం బహుళ త్రయోదశి సందర్భంగా గోపూజ, ఆలయ ప్రదక్షిణ, ఉదయం 9 గంటలకు సామూహిక శ్రీరమాసహిత వీరవెంకట సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 11న సోమవారం మాస శివరాత్రిని పురస్కరించుకుని భవానీ శంకర స్వామి వారికి ఏకాదశి రుద్రాభిషేకం, అన్నాభిషేకం జరుగుతుందన్నారు. 12వ తేదీన లక్ష్మీ గణపతి, నవగ్రహ, రుద్ర హోమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేరోజు తీర్థప్రసాదాల పంపిణీ జరుగుతుందన్నారు.

ఇద్దరికి గాయాలు

మాదల(ముప్పాళ్ళ): రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్న ప్రమాదంలో ఇరువురికి గాయాలైన సంఘటన మండలంలోని మాదల వద్ద శనివారం జరిగింది. సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పిడుగురాళ్ల మండలం జూలకల్లు గ్రామానికి చెందిన వినుకొండ రాజేష్ తన ద్విచక్రవాహనంపై సత్తెనపల్లి వైపు వెళుతుండగా, మాదల గ్రామంలోని ఎస్టీ కాలనీకి చెందిన కొమరగిరి రవి అనే అతను ఎదురుగా వచ్చి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ఇరువురికి గాయాలవటంతో చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.

వృద్ధులకు అన్నసంతర్పణ

సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు, 24వ వార్డు కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని మాతృశ్రీ మొల్లమాంబ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు, నరసరావుపేట రోడ్ లోని పరివర్తన చెవిటి, మూగ, మానసిక వికలాంగుల ఆశ్రమం పాఠశాలలోని చిన్నారులకు శనివారం అన్న సంతర్పణ నిర్వహించారు. ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ, 31 వార్డులో పేదలకు దుప్పట్లు పంపిణీ చేపట్టారు.

నష్టం ఎంత జరిగిందీ?

- రూరల్ పరిధిలో ప్రారంభమైన పంట నష్టం అంచనా
- వ్యవసాయ క్షేత్రాలకు ఆర్‌బీకే సిబ్బంది

నరసరావుపేట రూరల్: తుఫాన్ కారణంగా పంట నష్టం అంచనాను వ్యవసాయధికారులు ప్రారంభించారు. మండలంలోని 25 ఆర్‌బీకేల పరిధిలో వ్యవసాయ సహాయకులు పంట నష్టం అంచనా ప్రక్రియను చేపట్టారు. పంట దెబ్బతిన్న పంట పొలాల వద్ద రైతుల వివరాలు నమోదు చేసుకున్నారు. మండలంలో ప్రధానంగా మిరప, శనగ, వరి, మొక్కజొన్న, అరటి పంటలు భారీ వర్షాలకు దెబ్బతిన్నాయి. వారం రోజుల పాటు వ్యవసాయ సిబ్బంది పంట నష్టం అంచనాను నమోదు చేస్తారని మండల వ్యవసాయ అధికారి నరేంద్రబాబు తెలిపారు. రైతులు సిబ్బందికి సహకరించాలని కోరారు. గ్రామస్థాయిలో వీఆర్‌ఓ, పంచాయతీ కార్యదర్శి, ఆర్‌బీకే సిబ్బంది ఈ ప్రక్రియలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం తుదిజాబితాను ఆర్‌బీకేల్లో ప్రదర్శిస్తామని తెలిపారు.



లింగంగుంట్లలో దెబ్బతిన్న మొక్కజొన్న పంట వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయ సహాయకురాలు

ఘనంగా అమలోద్భవి మాత మహోత్సవం

నరసరావుపేట రూరల్: రావిపాడులో అమలోద్భవి మాత తిరునాళ్ల మహోత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మహోత్సవంలో పాల్గొని అమలోద్భవిమాతకు కొవ్వొత్తులు సమర్పించారు. మహిళలు, యువత అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. వివిధ ప్రాంతాల నుంచి విచారణ గురువులు సమిష్టి దివ్య పూజాబలిలో పాల్గొన్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ ప్రాగణంలో పెద్ద ఎత్తున కాలిన బాణసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా రూరల్ పోలీసులు చర్యలు తీసుకున్నారు.



విచారణ గురువుల ఆశీస్సులు తీసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

ఆత్మవిశ్వాసంతో జీవనం కొనసాగించండి

పౌష్టికాహారం పంపిణీలో ఆడిటర్ సీహెచ్ వెంకట్

చిలకలూరిపేట: దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఆత్మవిశ్వాసంతో జీవనం కొనసాగించాలని ఆడిటర్ సీహెచ్ వెంకట్ తెలిపారు. రోష్ని సర్వింగ్ సొసైటీ ఆధ్వర్యంలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఆరా ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం గుండయ్య తోటలోని కమ్యూనిటీ హాలులో శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్ మాట్లాడుతూ రోష్ని సర్వింగ్ సొసైటీ క్రమం తప్పకుండా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందజేయటం అభినందనీయమన్నారు. అలాగే ప్రతినెలా రెండో గురువారం వైద్య శిబిరాలు నిర్వహిస్తూ వారి జీవితానికి భరోసా కల్పిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సొసైటీ నిర్వాహకుడు షేక్ జిలాని బాష, రమణ, సుధాకర్, అనిత, నయీం పాల్గొన్నారు.



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

వి.రెడ్డిపాలెంలో ఘనంగా పూర్ణాహుతి

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలో గల శ్రీ సీతారామస్వామి ఆలయంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకొని శ్రీ రామనామ ఏకాహం శనివారం పూర్ణాహుతి నిర్వహించారు. కార్తిక మాసంలో హరేరామ, హరేకృష్ణ నామస్మరణతో 24 గంటల పాటు ఏకదాటిగా భజనా కార్యక్రమాలు నిర్వహించారు. రామనామ ఏకాహం పూర్ణాహుతి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం రామకృష్ణమాచార్యులు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో సీతారామ స్వామి

నిరుపేదలకు బాసటగా నిలవాలి

చిలకలూరిపేట: నిరుపేదలకు బాసటగా నిలవాల్సిన అవసరం ఉందని ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ చెప్పారు. పట్టణంలోని కేజే ఆసుపత్రి ప్రాంగణంలో ఒయాసిస్ సంస్థ ఆధ్వర్యంలో వృద్ధులు 100 మందికి దుప్పట్లు, చీరెలు, అల్పాహారం శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలోని వృద్ధ మహిళలపట్ల ఆదరణ చూపాల్సిన అవసరం ఉందని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ వృద్ధ మహిళలపట్ల బాధ్యతగా వ్యవహరించాలని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కరణం విజయలక్ష్మి, డాక్టర్ హిమబిందు, డాక్టర్ ప్రఫుల్లాదేవి, ఎండీ కరిమా, సీహెచ్ లలిత, చెరుకుపల్లి నిర్మల, నాగభైరు రామసుబ్బాయమ్మ తదితరులు పాల్గొన్నారు.



చీరెలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఒయాసిస్ సభ్యులు

ఉత్సాహంగా ‘ఆడుదాం’..!

- సచివాలయాలకు చేరిన ఆడుదాం ఆంధ్ర కిట్లు
- 15 నుంచి క్రీడలు ప్రారంభం
- మహిళలకు, పురుషులకు వేర్వేరుగా పోటీలు

అచ్చంపేట: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందుకు గాను క్రీడా సామగ్రి సచివాలయాలకు చేరాయి. సచివాలయాల పరిధిలో క్రీడలు నిర్వహించి ప్రతిభ కనబరచినవారిని మండల స్థాయిలో ఆడించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మండలస్థాయి విజేతలను నియోజకవర్గ స్థాయిలో, నియోజకవర్గ స్థాయి విజేతలను జిల్లా స్థాయిలో, జిల్లాస్థాయి విజేతలను రాష్ట్రస్థాయికి తీసుకెళ్లనున్నారు. ఈ క్రీడల ద్వారా ప్రతిభఉండి ప్రోత్సాహం లేక గ్రామాలలోనే మగ్గే క్రీడాకారులు రాష్ట్ర స్థాయికి వెళ్లేందుకు ఇదో మంచి అవకాశంగా చెప్పవచ్చు.

ఐదు క్రీడల్లో మహిళలకు, పురుషులకు వేర్వేరుగా.. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడలలో మహిళలకు, పురుషులకు వేరు వేరుగా పోటీలు జరగనున్నాయి. ఇందుకు గాను ప్రతి గేమ్‌కు మూడు కిట్లు చొప్పున గ్రామ సచివాలయాలకు ఇప్పటికే చేరాయి. మండలంలో మొత్తం 17 సచివాలయాలు ఉండగా, ప్రతి సచివాలయానికి ఒక్కొక్క టీమ్‌కు మూడు కిట్లు చేరాయి. వీటిలో రెండు పురుషులకు, ఒకటి మహిళలకు కేటాయించబడుతుంది. 15సంవత్సరాలు నిండిన రాష్ట్రానికి చెందిన వారెవరైనా క్రీడలలో పాల్గొనవచ్చు. ప్రతిభ కనబరచిన వారికి ప్రోత్సాహక బహుమతులుంటాయి.



గ్రామ సచివాలయాలకు చేరిన ఆడుదాం ఆంధ్ర క్రీడా కిట్లు

క్రీడలలో పాల్గొనడం ఇలా...

పాల్గొనదలచివారు వెంటనే తమ సమీపంలోని గ్రామ సచివాలయంలో తమకు ఇష్టమైన క్రీడల్లో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకోవాలి. ఇంటర్నెట్ సౌకర్యం ఉన్నవారు adudamandhra. ap. in అనే వెబ్‌సైట్‌లో గాని, 1902 నెంబరుకు ఫోను చేయడం ద్వారా గాని పేర్లు నమోదు చేసుకోవచ్చు. పూర్తి వివరాలు గ్రామ సచివాలయంలోని మహిళా పోలీసుల ద్వారా తెలుసుకోవచ్చు.

భక్తిశ్రద్ధలతో కార్తికమాస పూజలు

పెదకూరపాడు: పెదకూరపాడులోని నాగేంద్ర స్వామి దేవాలయంలో కార్తికమాసం పురస్కరించుకుని శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో నాగేంద్రస్వామి వార్షికోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా సమీవృక్ష పూజలను భక్తులు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. ప్రతి ఏడాది కార్తికమాసం చివరి మూడు రోజులు నాగేంద్ర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మూడురోజులపాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోంది.

రేణుకాదేవి ఆలయంలో మండలపూజ



గణపవరంలో రేణుకాదేవి, గంగమ్మ తల్లి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నాదెండ్ల: గణపవరం గ్రామంలో కొలువైయున్న కెల్లంపల్లి వారి ఇలవేల్పు రేణుకాదేవి, గంగమ్మతల్లి ఆలయంలో శనివారం మండల పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఈ ఏడాది అక్టోబర్ నెల 18వ తేదీన సుమారు రూ.7.5 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఈ ఆలయంలో అమ్మవారి ప్రతిష్ట నిర్వహించారు. ప్రతిష్టను నిర్వహించి 41 రోజులు పైబడిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయంలో పూజారి దర్శి అనిల్‌కుమార్ బృందం ఆధ్వర్యంలో అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. కెల్లంపల్లి కుటుంబీకులు పీటలపై కూర్చుని అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కెల్లంపల్లి కుటుంబీకులతో ఆలయం సందడిగా మారింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం

వినుకొండ(నూజెండ్ల): స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణీకులకు మెరుగైన సేవలు, సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ఆదివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నటు డీఎం బి.కోటేశ్వరరావు నాయక్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్యలో ప్రయాణీకులు 9959225431 నంబరుకు ఫోన్ చేసి సలహాలు, సూచనలు, ఫిర్యాదులు తెలియజేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

లోక్ అదాలత్‌లలో సత్వర న్యాయం



సత్తెనపల్లి: రాజీమార్గమే రాజమార్గమని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్‌పర్సన్ డి.నాగవెంకటలక్ష్మి అన్నారు. దేశవ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా పట్టణంలోని నాలుగు న్యాయస్థానాల పరిధిలో మూడు బెంచ్‌లను ఏర్పాటు చేసి మొత్తం 122 కేసులను పరిష్కరించారు. మొదటి బెంచ్‌కు సీనియర్ సివిల్ జడ్జి డి.నాగవెంకటలక్ష్మి న్యాయమూర్తిగా, లోక్ అదాలత్ మెంబర్‌గా న్యాయవాది గంట వెంకట శివ, సత్తెనపల్లి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులను కలిపి రెండవబెంచ్‌కి న్యాయమూర్తిగా మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి తౌషీద్ హుస్సేన్, లోక్అదాలత్ మెంబర్‌గా న్యాయవాది ఆకుల నాగార్జున, మూడో బెంచ్‌కి న్యాయమూర్తిగా రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ గౌస్, లోక్అదాలత్ మెంబర్‌గా బి.లక్ష్మీకోటేశ్వరరావు వ్యవహరించారు. మొత్తం 122 కేసులు పరిష్కరించగా వీటిల్లో క్రిమినల్ -96, పీఎల్సీలు -7, చెక్కు బౌన్స్ - 4, గృహహింస -1, సివిల్ -13 కేసులు పరిష్కరించారు. వీటి ద్వారా రూ.1,80,73,000 చేతులు మారాయి. ఆయా కార్యక్రమాల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మారూరి లింగారెడ్డి, న్యాయవాదులు ఉన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి

సత్తెనపల్లి: ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలను ప్రభుత్వాలు దెబ్బతీయరాదని, అలా చేసే ప్రభుత్వాలు మనుగడ సాధించలేవని ఎస్టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శనివారం జరిగిన ఏపీ ఎస్టీయూ సత్తెనపల్లి ఏరియా పరిధిలోని సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, బెల్లంకొండ శాఖల నూతన వార్షిక కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశానికి సత్తెనపల్లి ప్రాంతీయ కార్యదర్శి షేక్ మహబూబ్ సుభాని అధ్యక్షతన వహించారు. జోసెఫ్ సుధీర్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వాలు ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలను కాపాడేలా సమీక్షించి, వారి సంక్షేమానికి కట్టుబడే చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఎం సుభాని మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేయాలని, ఓపీఎస్‌ను పునరుద్ధించాలని కోరారు. పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఎల్‌వీ రామిరెడ్డి, గుంటూరు జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు, పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి యు.చంద్రజిత్ యాదవ్‌లు మాట్లాడారు. సమావేశంలో సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, బెల్లంకొండ మండలాల నూతన కార్యవర్గలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్‌కే కరిముల్లా, ఆర్థిక కార్యదర్శి ఇ.ఏమండీ, సీనియర్ నాయకులు జె.శ్రీనివాసరావు, ఏరియా కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తిక వనసమారాధన



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు దంపతులు

పాల్గొన్న శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల : స్థానిక బాలత్రిపుర సుందరీ సమేత శంకరస్వామి దేవస్థాన ఆవరణలో శనివారం కార్తిక వన సమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి వైస్సార్‌సీపీ నాయకులు, ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్తులు ఎదురేగి స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామస్తులందరు కలిసి కార్తికమాసంలో వనసమారాధన కార్యక్రమాలు జరుపుకోవడం అభినందనీయమన్నారు. దీనివల్ల గ్రామస్తులలో ఐక్యత, స్నేహభావం పెంపొందుతాయన్నారు. ప్రతి సంవత్సరం ఈ విధంగా ఐకమత్యంతో కార్తిక వనసమారాధన కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు. అనంతరం ఆయన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ ఆవరణలో భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. సుమారు నాలుగువేల మందికిపైగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు పడాల శివారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కురుగంటి శ్రీనివాసరెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ గెల్లి చిన కోటిరెడ్డి, బత్తుల రామకృష్ణ, చపారపు సంజీవరెడ్డి, మానుకొండ వాసుదేవరెడ్డి, కల్లం శివారెడ్డి, మాజీ రేషన్ డీలర్ గెల్లి కోటిరెడ్డి, విఆర్‌ఓ పడాల సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పచ్చవ రవీంద్రబాబు, పమ్మి కోటిరెడ్డి, పడాల రమణారెడ్డి, పడాల హనిమిరెడ్డి, కల్లి పిచ్చిరెడ్డి ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేల్పూరులో కార్తికమాస వేడుకలు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీభూసమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో కార్తికమాస వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ పూజారి దీవి మారుతీ రామచార్యులు సారథ్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. దంపతులచే కుంకుమ పూజలు, సుదర్శన హోమం, పంచామృత అభిషేకాలు తదితర విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు దంపతులు కుటుంబ సభ్యులు పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం గ్రామ పురవీధుల్లో ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక అలంకరణ చేసి మేళతాళాలు నడుమ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. ఈకార్యక్రమంలో అయ్యప్ప మాలధారణ భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.

తుదిదశకు సబ్ స్టేషన్ నిర్మాణ పనులు

వేల్పూరులో రూ.4 కోట్లు వ్యయంతో నిర్మాణం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామ సమీపాన ప్రభుత్వ భూమి ఎకరం స్థలంలో నిర్మిస్తున్న విద్యుత్ సబ్ స్టేషన్ పనులు తుది దశకు చేరాయి. మండలంలోని గంటావారిపాలెం గ్రామ సమీపాన అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధి నుంచి సబ్‌స్టేషను వరకు సన్‌పోల్స్ 45 విద్యుత్ స్తంభాలు నిర్మాణ పనులు పూర్తి చేశారు. అలాగే నూతన సబ్‌స్టేషన్ పరిధిలో అనుసంధానం చేసే గ్రామాల్లో 200 విద్యుత్ స్తంభాలతో పాటు నూతన లైను పనులు పూర్తి చేశారు. సుమారు రూ.4 కోట్ల వ్యయంతో 33/11 కేవీ సామర్థ్యంతో ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం అవుతోందని ఏఈ సంపెంగుల గాంధీ వివరించారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు గ్రామస్తులు సహకారంతో పనులన్నీ తుదిదశకు చేరాయన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో త్వరలో ఐదు ఎంవీ సామర్థ్యం కల్గిన ట్రాన్స్‌ఫార్మర్‌తో యంత్ర పరికరాలు అమర్చే పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. నూతన విద్యుత్ సబ్ స్టేషను పనులు పూర్తి అయితే వేల్పూరు, పోట్లూరు, గంటావారిపాలెం, బొగ్గరం తదితర గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సేవలు మరింత చేరువలోకి వస్తాయన్నారు.



నిర్మాణంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్

సహపంక్తి భోజనాలు ఐక్యతాభావాన్ని పెంపొందిస్తాయి

పట్టణ సీఐ ఎస్ సాంబశివరావు

వినుకొండ(నూజెండ్ల): కార్తిక మాస సహపంక్తి భోజనాలు ప్రజల్లో ఐక్యతను సేవా స్ఫూర్తిని పెంపొందిస్తాయని పట్టణ సీఐ ఎస్.సాంబశివరావు అన్నారు. బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్తిక మాస వన మహోత్సవ కార్యక్రమం వెల్లటూరు రోడ్డులో గల బెజవాడ గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐ హాజరై ప్రసంగించారు. మన కర్తవ్యం మనం నిర్వహిస్తే ఆనందం కలుగుతుందని తెలిపారు. అనంతరం సీఐతో పాటు పట్టణ ప్రముఖులను ట్రస్ట్ చైర్మన్ బెజవాడ వెంకట నాగేశ్వరరావు, సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కూచి రామాంజనేయులు, జె.మాల్యాద్రి, తోట హనుమ, కొల్లి శివ, లగడపాటి శ్రీనివాసరావు, శర్మ, జి.నాగేంద్రుడు, ఎంఎస్‌కే బాషా, డాక్టర్ మీరావలి, గంగవరపు శ్రీనివాసరావు, వెంకాయమ్మ, మాదాల వెంకటరామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సీఐ సాంబశివరావు, పట్టణ ప్రముఖులను సన్మానిస్తున్న బీవీ నాగేశ్వరరావు

నేడు ఆర్యవైశ్యుల కార్తిక వనభోజనాలు

శావల్యాపురం: నేడు మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో వేంచేసియున్న అడవి పేరంటాళ్లమ్మ అమ్మవారి సన్నిధిలో ఆర్యవైశ్యుల సంఘం ఆధ్వర్యంలో కార్తికమాస వనభోజనాలు కార్యక్రమం జరుగుతుందని ఆర్యవైశ్య సంఘం నేత రెడ్డి గోపాలకృష్ణ ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలోని ఆర్యవైశ్యుల సారథ్యంలో ప్రతిఏటా వేడుకలు జరుపుతున్నామన్నారు. ఆర్యవైశ్యులు మహిళలకు ప్రత్యేక కార్యక్రమాలతో పాటు బహుమతులు కూడా ఏర్పాటు చేశామన్నారు. అందరు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఆయనతో పాటు గట్టుపల్లి సత్యనారాయణ, పద్మనాభుని హనుమంతరావు పాల్గొన్నారు.

అయోధ్య రామమందిరం అక్షింతలకు ఘనస్వాగతం

క్రోసూరు: వచ్చే జనవరి 22వ తేదీన అయోధ్యలో రామమందిరం ప్రారంభం సందర్భంగా దేశంలోని ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు చేరాలన్న సంకల్పంతో తీసుకొచ్చిన రామ మందిర అక్షింతలకు శనివారం క్రోసూరు గ్రామ ప్రజలు ఘనస్వాగతం పలికారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమం క్రోసూరులో అత్యంత వైభవోపేతంగా శోభాయాత్రగా జరిగింది. ఈ శోభాయాత్ర లక్ష్మీనరసింహస్వామి దేవాలయం నుంచి ప్రారంభమై పురవీధులలో పయనిస్తూ క్రోసురులోని అన్ని దేవాలయాలను స్పృశిస్తూ వేణుగోపాల స్వామి దేవాలయానికి చేరుకుంది. దేవాలయ పూజారి పూర్ణకుంభంతో అయోధ్య అక్షింతలకు స్వాగతం పలికారు. మహిళలు, భక్తులు తండోపతండాలుగా హాజరై అయోధ్య రామమందిర అక్షింతలు ఉన్న పూర్ణకుంభానికి భక్తిశ్రద్ధలతో హారతులు ఇచ్చారు. జైశ్రీరామ్ అంటూ జయజయ ధ్వనులు చేస్తూ క్రోసూరు పురవీధులు మారుమోగాయి. జనవరి 1వతేదీ నుంచి 15 వరకు భక్తులకు పంపిణీ చేస్తామని విశ్వహిందూపరిషత్ మండల ప్రచారక్ కామేశ్వరాచారి తెలియజేశారు.



అయోధ్య రామమందిర కలశం, అంక్షితల పూర్ణకుంభాన్ని స్వాగతిస్తున్న మహిళలు

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసరావుపేట డివిజన్
99122 25439 (నరసరావుపేట)
90105 83302
90102 03704 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)
Office mail : sakshigntadvt@gmail.com